విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో
మండల రిపోర్టర్లు, జిల్లా బ్యూరోలు,
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు గా
పనిచేయుటకు ఉత్సాహవంతులైన
రిపోర్టర్లు కావలెను

వివరాలకు సంప్రదించండి
8185853985



# నేటి ప్రజావాణి

ప్రతి క్షణం ప్రజాహితం

తెలుగు దినపత్రిక





నీకోసం జీవిస్తే
నీలోనే జివిస్తావు
అదే జనం కోసం జీవిస్తే
జన హృదయాల్లో
నిలిచిపోతావ్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్




హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 351 | పేజీలు : 4 | ఎడిటర్ : కొమ్ము కార్తీక్ | శుక్రవారం,డిసెంబర్12,2025 | వెల : 4/-




విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో మండల రిపోర్టర్లు, జిల్లా బ్యూరోలు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు గా పనిచేయుటకు ఉత్సాహవంతులైన రిపోర్టర్లు కావలెను

వివరాలకు సంప్రదించండి
8185853985



# నేటి ప్రజావాణి

ప్రతి క్షణం ప్రజాహితం

తెలుగు దినపత్రిక





నీకోసం జీవిస్తే
నీలోనే జీవిస్తావు
అదే జనం కోసం జీవిస్తే
జన హృదయాల్లో
నిలిచిపోతావ్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్





హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 351 | పేజీలు : 4 | ఎడిటర్ : కొమ్ము కార్తీక్ | శుక్రవారం,డిసెంబర్12,2025 | వెల : 4/-






ఇండిగో ప్రయాణికులకు

## ఊరట

- రూ. 10,000 పరిహారం ప్రకటన
- విమానాల రద్దుతో ఇబ్బంది పడిన ప్రయాణికులకు ఇండిగో పరిహారం
- తీవ్రంగా నష్టపోయిన వారికి రూ. 10,000 విలువైన ట్రావెల్ వోచర్లు
- విమాన సర్వీసుల వైఫల్యంపై దర్యాప్తునకు బయటి నిపుణులు

**న్యూఢిల్లీ,డిసెంబర్11**

విమాన సర్వీసుల అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో గురువారం ఊరట కల్పించే ప్రకటన చేసింది. ఈ నెల ప్రారంభంలో విమానాల రద్దు, ఆలస్యం కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారికి రూ. 10,000 విలువైన ట్రావెల్ వోచర్లను అందిస్తున్నట్లు తెలిపింది.

మెస్సీ హైదరాబాద్ పర్యటన

# ప్రైవేట్ కార్యక్రమం

## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

- ఈవెంట్‌కు హాజరు కావాలని రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం
- ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్
- ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు
- ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్11**

ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన



తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు.

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో

# కాంగ్రెస్ జోరు

- తొలి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు ఎన్నికలు
- 776 మంది కాంగ్రెస్, 312 మంది బీఆర్ఎస్, 63 మంది బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు
- కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లెలో తల్లి గంగవ్వపై కూతురు సుమలత 91 ఓట్లతో విజయం



**హైదరాబాద్,డిసెంబర్11**

తెలంగాణ రాష్ట్రంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సాయంత్రానికి వెలువడిన ఫలితాల సరళిని పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లి, కుమార్తె మధ్య పోటీ నెలకొంది. రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించడంతో శివరాత్రి గంగవ్వను బీఆర్ఎస్ బలపరచగా, ఆమె కుమార్తె సుమలతను కాంగ్రెస్ బలపరిచింది.

వరంగల్ ఎన్ఐటీలో తెలంగాణ తొలి

## జెన్-జి పోస్టాఫీసు ప్రారంభం

- యువతను ఆకట్టుకునేలా రంగురంగుల హంగులతో రూపకల్పన
- విద్యార్థులకు స్పీడ్ పోస్ట్‌పై ప్రత్యేక డిస్కౌంట్లు, వై-ఫై సదుపాయం
- తొలిరోజే భారీ స్పందన.. పెద్దఎత్తున ఖాతాలు తెరిచిన విద్యార్థులు, సిబ్బంది



**వరంగల్,డిసెంబర్11,**

తెలంగాణలో మొట్టమొదటి 'జెన్-జి' థీమ్ పోస్టాఫీసు వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ప్రాంగణంలో ప్రారంభమైంది. ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుద్ధి బుధవారం దీనిని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ సుమితా అయోధ్య, ఎన్ఐటీ రిజిస్ట్రార్ సునీల్ కుమార్ మెహతా, హనుమకొండ డివిజన్ ఎస్పీ నరేంద్ర బాబు హాజరయ్యారు.





ఏపీ రాజధాని అమరావతిలో

## కాగ్ కార్యాలయం

- అమరావతిలో కాగ్ కార్యాలయ భవనానికి కేంద్రం ఆమోదం
- రాజధాని అభివృద్ధిలో ఇది కీలక అడుగన్న కేంద్ర మంత్రి పెమ్మసాని

**అమరావతి,డిసెంబర్11,**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధిలో మరో ముఖ్యమైన ముందడుగు పడింది. అమరావతిలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కార్యాలయ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

# ఏపీ-కర్ణాటక సరిహద్దు వివాదం

- ఏపీ-కర్ణాటక సరిహద్దులోని వివాదాస్పద గనుల పరిశీలన
- అనంతపురం జిల్లాలో పర్యటించిన జస్టిస్ సుధాన్షు ధూలియా కమిటీ
- ఆరు మైనింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన బృందం



**అమరావతి,డిసెంబర్11,**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు గనుల వివాదంపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా నేతృత్వంలోని ఈ కమిటీ నిన్న అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలంలోని వివాదాస్పద ప్రాంతాల్లో పర్యటించింది.

స్వల్పంగా పెరిగిన బంగారం, వెండి

# ధరలు

- వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఫెడ్ రిజర్వ్
- భవిష్యత్తులో వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి
- ఉదయం స్వల్పంగా తగ్గి, ఫెడ్ నిర్ణయం తర్వాత పెరిగిన ధరలు

**న్యూఢిల్లీ,డిసెంబర్11,**

బంగారం, వెండి ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ విలువైన లోహాల ధరలు పెరిగాయి. భవిష్యత్తులో వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో ధరలు పెరుగుతున్నాయి.

# ఢిల్లీలో తగ్గని వాయు కాలుష్యం

- మూడో రోజూ 'పూర్' కేటగిరీలోనే గాలి నాణ్యత
- నగరంలోని పదికి పైగా ప్రాంతాల్లో 300 దాటిన కాలుష్యం
- కనీస ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందన్న ఐఎండీ

**న్యూఢిల్లీ,డిసెంబర్11,**

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. వరుసగా మూడో రోజు గురువారం కూడా గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోనే కొనసాగుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం, ఈ ఉదయం 7 గంటలకు నగరంలో సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 285గా నమోదైంది. ఇది 'వెరీ పూర్' కేటగిరీ (301)కి చాలా దగ్గరగా ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. నగరంలోని పదికి పైగా పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ ఇప్పటికే 300 మార్కును దాటి 'వెరీ పూర్' కేటగిరీలో నమోదైంది. ఆనంద్ విహార్‌లో 300, అశోక్



విహార్‌లో 328, చాందినీ చౌక్‌లో 305, ఐటీఓ వద్ద 309గా కాలుష్య తీవ్రత రికార్డయింది. ఢిల్లీని ఆనుకుని ఉన్న నోయిడాలో సగటు ఏక్యూఐ 294గా ఉండగా, గ్రేటర్ నోయిడాలోని కొన్ని ప్రాంతాల్లో 331 వరకు నమోదైంది.





అరుణాచల్‌లో

## రోడ్డు ప్రమాదం

- 21 మంది కూలీలతో వెళుతున్న ట్రక్కు లోయలో పడిపోయిన వైనం
- ఈ ఘటనలో 17 మంది మృతి చెందినట్లు అనుమానం
- సోమవారం జరిగిన ప్రమాదం గురువారం వెలుగులోకి

**డిసెంబర్11,**

అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇండో-చైనా సరిహద్దుకు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 21 మంది కార్మికులతో వెళుతున్న ఓ ట్రక్కు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు

# సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- నేడు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో బేషరతుగా లొంగిపోవాలని ఆదేశం
- ప్రభాకర్ రావును శారీరకంగా హింసించవద్దని దర్యాప్తు బృందానికి సూచన



**హైదరాబాద్,డిసెంబర్11,**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తెలంగాణ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారుల ఎదుట శుక్రవారం బేషరతుగా లొంగిపోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తునకు ప్రభాకర్ రావు ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనకు గతంలో మంజూరు చేసిన మధ్యంతర అరెస్ట్ ఉపశమనాన్ని ఎత్తివేయాలని కోరుతూ సిట్ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసులో కీలకమైన ఐఫోన్‌కు సంబంధించిన క్లౌడ్ ఖాతాల పాస్‌వర్డ్‌లను ఆయన రీసెట్ చేసి, సమాచారం ఇవ్వడం లేదని తమ పిటిషన్‌లో ఆరోపించారు. సిట్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, విచారణ సందర్భంగా ప్రభాకర్ రావును శారీరకంగా హింసించవద్దని దర్యాప్తు బృందానికి ప్రత్యేకంగా సూచించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో ఈ కేసులో ప్రభాకర్ రావు చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకున్నట్లయింది.

# 20న టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభ

- జిల్లా కమిటీ, ఆహ్వానితుల సమావేశంలో నిర్ణయం
- విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు పిలుపు
- అక్రిడిటేషన్, ఇండ్లస్థలాల పాలసీ వెంటనే ప్రకటించాలి
- మామిడి సోమయ్యకు టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం లేదు
- ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఖదీర్



ఖమ్మం,జిల్లా బ్యూరో,డిసెంబర్11(నేటి ప్రజావాణి)న్యూస్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మహాసభలు ఈనెల 20వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి, స్టేట్ అడ్ హక్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖదీర్ వెల్లడించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ, ఆహ్వానితుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాకు చెందిన జర్నలిస్టులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు, ఆయా రంగాల ప్రముఖులు, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులను ఈ మహాసభలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టు మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి, కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులు ఎవ్వరికీ అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ప్రత్యేక పాలసీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి వేళల్లో ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టు సంఘాలను రద్దు చేస్తూ కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్ ను రాష్ట్రంలో అమలు కాకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**జర్నలిస్టుల గందరగోళ పరిచేలా సోమయ్య ప్రకటనలు..**

మామిడి సోమయ్యకు టీడబ్ల్యూజేఎఫ్ కు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ స్పష్టం చేశారు. సంఘం వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సోమయ్య ను సంఘం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ రాష్ట్ర కార్యవర్గం, జనరల్ బాడీ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. ఉనికి కోసమే ఆయన జిల్లాల్లో తిరుగుతూ జర్నలిస్టులను గందరగోళపరుస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు జక్కంపూడి కృష్ణ, కోటి శివారెడ్డి, దువ్వా సాగర్, కూరాకుల గోపీ, మానుకొండ రవికిరణ్, ఆవుల శ్రీనివాస్, షేక్ జానీపాష, కొత్త యాకేష్, మధుశ్రీ, దేవేందర్, కరుణాకర్ రెడ్డి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# 17న హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

**21 వరకు శీతాకాల విడిది**
**సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలి**
**అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచన**

హైదరాబాద్, డిసెంబర్ 11 : శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము ఈ నెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజుల రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమ న్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించా రు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని, పరిసరాల్లో కోతుల బెడదను ఎదు ర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, తేనెటీగలను పట్టుకోవానికి ముం దుస్తు ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు.సమీక్షలో డీజీపీ శివధర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హెూం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ శ్రీధర్, అదనపు డీజీ పీలు మహేశ్ భగవత్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్ర మ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రి యాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్లో బోర్డులు మారడం తప్ప అభివృద్ధి మాత్రం శూన్యం

- స్థానిక నాయకుల సవటతనం స్వార్ధ రాజకీయల తో బోడుప్పల్ ప్రజలను దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి చెందలేదు
- బోడుప్పల్లో ప్రజల కోసం100 పడకల ప్రభుత్వ దావా ఖానా ఎక్కడ - దాసరి మహేష్ యాదవ్
- ఎల్బీనగర్ జోన్ కాకుండా ఉప్పల్ జోన్ చేస్తే బాగుంటుంది



మేడ్చల్ జిల్లా బోడుప్పల్ డిసెంబర్ 11,నేటి ప్రజావాణి బోడుప్పల్ గ్రామపంచాయతీ 2014లో మున్సిపాలిటీగా మారగా ఎలాంటి పాలకవర్గం లేకుండానే ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ గా 2016 లో విలీనం చేశారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ తో ఎంతో అభివృద్ధి చెందింది కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఆధ్వర్యంలో నేషనల్ అవార్డులు రావడం జరిగింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బోడుప్పల్లో ప్రజలసౌకర్యం కోసం100 పడకల ప్రభుత్వ దావా ఖానా, విద్యార్థులకు గ్రంథాలయం, ప్లే గ్రౌండ్, ప్రభుత్వ ఇంటర్ %డ% డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటిఐ కళాశాల, అధికారంలో ఉన్నప్పుడు ఈ పనులన్నీ చేస్తారు అనుకున్నారు.కానీ ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు లేకుండా పోయాయి. ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే గత ప్రభుత్వ పనులను బోడుప్పల్ ప్రజల కోసం అభివృద్ధి చేస్తారని అనుకున్న ప్రజలకు బోడుప్పల్ (జి.హెచ్.ఎం.సి) లో విలీనం కలవడంతో, బోడుప్పల్లో బోర్డులు మారడం తప్ప అభివృద్ధి మాత్రం శూన్యం, ఏది ఏమైనా చేసేది ఏమీ లేదు అని బోడుప్పల్ ప్రజలు భావిస్తున్నారు. ఇప్పుడు కూడా ఆగమేఘాలపై (జి.హెచ్.ఎం.సి)లో సికింద్రాబాద్ జోన్లో కలపడం బోడుప్పల్ ప్రజలకు చాలా ఇబ్బంది జరుగుతుంది. కనీసం ఎల్బీనగర్ జోన్లో కలిపిన బాగుంటుందని ప్రజలు అనుకుంటున్నారు. ఎల్బీనగర్ జోన్ కాకుండా ఉప్పల్ జోన్ చేస్తే బాగుంటుందని ప్రజలకు అందుబాటులో ఉంటుందని, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు దాసరి మహేష్ యాదవ్, అన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు



నేటి ప్రజావాణి వలిగొండ డిసెంబర్ 11
మల్లేష్ గౌడ్ రిపోర్టర్ వలిగొండ

పట్టణ కేంద్రంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి నియోజకవర్గంలో చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కుంభం వెంకట్ పాపిరెడ్డి తండ్రి కీర్తిశేషులు కుంభం రమణారెడ్డి గతంలో గ్రామంలో చేసిన సేవలను ఆకర్షితులై గురువారం రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి పట్టణ ముఖ్య నాయకులు మాజీ ఆత్మ చైర్మన్ గంగాధరి రాములు బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిళ్ళ రత్నయ్య ,మాజీ మత్స్యగిరీగుట్ట డైరెక్టర్ పోలేపాక బిక్షపతి, మండల ఎస్సీ సెల్ నాయకులు బల్లెపు కృష్ణ స్వామి, ఎల్లంకి పాండరి, పోలేపాక శ్రీశైలం, పోలెపాక కమలాకర్, పోలేపాక కొండల్, పోలేపాక గణేష్, పోలెపాక సందీప్, ఎల్లంకి పూజ, పోలేపాక వజ్రమ్మ, పోలేపాక పూజ, పోలెపాక దివ్య , సుమారు 20 మంది బిఆర్ఎస్ పార్టీ నీ వీడి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల పట్టణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కోటియా తండాలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి లింగమూర్తికి మద్దతుగా విప్ రామచంద్రనాయక్ ప్రచారం




మరిపెడ, డిసెంబర్ 11: (నేటి ప్రజావాణి)మరిపెడ మండలం కోటియా తండాలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి లింగమూర్తి విజయం సాధించేందుకు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రామచంద్రనాయక్ గారు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. పార్టీ బలోపేతం కోసమే కాక, తండా అభివృద్ధి కోసం లింగమూర్తి విజయం కీలకమని ఆయన పేర్కొన్నారు.

# మర్లపాడులో వినూత్నంగా ప్రచారం చేస్తున్న సీపీఎం అభ్యర్థి బొందల"









- వేంసూరు లో రాణీరుద్రమ్మదేవి ప్రచారం"
- సమస్యలపై పోరాటమే మా అభిమతం"

వేంసూరు,డిసెంబర్11(నేటి ప్రజావాణి)న్యూస్: వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో సర్పంచ్ కు బరిలో ఉన్న సీపీఎం బలపరిచిన అభ్యర్థి బొందల యాకోబు(ఆటో డ్రైవర్) గురువారం విన్నూత్న పద్ధతిలో తన గుర్తు అయిన క్రికెట్ బ్యాట్ ను చేతబూని గడప గడపకు తిరిగి ఓట్లను అభ్యర్థించారు.వేంసూరు గ్రామంలో కూడా సీపీఎం బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి రాణీ రుద్రమ్మదేవి తన గుర్తు ఫుడ్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు.ఇరు గ్రామాలలో మండల కమిటి సభ్యులు మల్లూరు చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రచారాన్ని ప్రారంభం చేసిన మండల సీపీఎం కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు మాట్లాడుతూ వేంసూరు లో ప్రజలు ఎదుర్కొంటున్న 18 రకాల సమస్యలు,మర్లపాడు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న 17 రకాల సమస్యలు పరిష్కారం కోసం పోరాటమే అభిమతంగా మా పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారని మాకు ఆశయ బలమే తప్పా ఆర్థిక బలం లేదని ఓటర్లు నిజాన్ని ఓటు వేసి బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో:డంకర శ్రీను, మోరంపూడి వెంకటేశ్వరరావు,కావూరి భగత్ సింగ్,కొత్తా సత్యనారాయణ,పొన్నంపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఈ మధ్యకాలంలో పిల్లల్లో నేర ప్రవత్తి విపరీతంగా పెరిగిపోతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది పిల్లలు చేసిన అకత్యాలు, హింసాత్మక, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం వంటి చర్యలు అందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. పిల్లలు తెలిసో తెలియకో, సోషల్ మీడియా ప్రభావం వల్లనో లేక మత్తు పదార్థాలు సేవించడం వల్లనో- తమకు మంచి చెప్పేందుకు ప్రయత్నించిన ఉపాధ్యాయులపై సైతదాడులకు పాల్పడటం దారుణం. మద్యం సేవించి క్లాస్ రూమ్‌లోకి అడుగుపెట్టడం, ఆడపిల్లలపై లైంగిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులు మందలించారనే నెపంతో ఆత్మహత్యయత్నాలు చేయడం ఆందోళనకరం. స్మార్ట్ ఫోన్ల ప్రభావం, తల్లిదండ్రుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల అలసత్వం వెరసి నేటి పిల్లలు ఇలా చెడు పంథాలో వెళుతుండడం కనిపిస్తోంది. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే వారిని ఉపాధ్యాయులు మందలించటం అనేది వారి విధి, బాధ్యత. అయితే కొంతమంది తల్లిదండ్రులు తప్పు చేసిన తమ పిల్లలకు నచ్చజెప్పాల్సింది పోయి తమ పిల్లల్ని దండించిన ఉపాధ్యాయుల మీదకే దండెత్తుతున్న సంఘటనలూ జరుగుతున్నాయి. ఇది ఏ మాత్రం భావ్యమో, సమంజసమో విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలి. ఒక్కొక్కసారి ఉపాధ్యాయులు సైతం తమ గురుతర బాధ్యతను మరచి కొంతమంది పిల్లలపై చీటికీ మాటికీ దండనకు పాల్పడటం సరైంది కిదు. దీని మూలాన కూడా ఆ పిల్లల హృదయాలు గాయపడి వారు నేరస్థులుగా మారే ప్రమాదం వుంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండాలి. ఏవైనా తమ పిల్లల వ్యవహారశైలిలో మార్పులు చోటు చేసుకుంటే తక్షణమే వారిని సైకాలజిస్టుల దగ్గరకు తీసుకెళ్లి వారి చెడు ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు కృషి సల్పాలి.పిల్లలకు మద్యం, సిగరెట్లు, బీడీలు అమ్మకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చైనా, ఆస్ట్రేలియా దేశాల మాదిరిగా పిల్లలకు అశ్లీల సైట్స్, సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్స్ వంటివి అందుబాటులో లేకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఈ బాధ్యత మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కంధాలపై వుంది. పిల్లల్లో మానవతా విలువలను పెంపొందింపజేసేలా, తమ పిల్లలకు ఏమైనా చెడు స్నేహాలు, వ్యసనాలు ఉంటే తక్షణమే వాటిని వారు వదిలించుకునేలా చేసే బాధ్యత తల్లిదండ్రులపై వుంది. చెడు పంథాలో వెళుతున్న పిల్లల నడవడికలో మార్పు తెచ్చేందుకు ఒక వైపు తల్లిదండ్రులు, మరో వైపు ఉపాధ్యాయులు కృషి చేయాలి. చీకట్లు కమ్ముకున్న పిల్లల జీవితాల్లో మనమంతా వెలుగులు నింపే ప్రయత్నం చేయడమే కాదుబీ వారికి ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేయాలి. నేటి పిల్లలు ఓ బాధ్యత గల రేపటి భారత పౌరులుగా ఎదగాలి. విధ్వంసకర శక్తులుగా ఎలాంటి పరిస్థితుల్లో ఎదగకూడదు.

# ముదావహం

ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, అమెరికా పశ్చిమ దేశాలుసహా పలు దేశాలు కట్టకట్టుకుని ప్రత్యర్థికి కొమ్ముకాస్తున్నా%ొ% నేనున్నానంటూ కష్టసమయాల్లో భరోసా ఇచ్చిన విశ్వసనీయ మిత్రదేశం రష్యాతో ఇండియా సంబంధాలు మరింత దృఢం కావడం ఆహ్వానించదగ్గ పరిణామం. మన దేశ రక్షణతోపాటు అనేక రంగాల్లో భరోసా ఇచ్చి, అమెరికా ఆగడాలను నిలువరించేందుకు అండగా నిలిచిన చరిత్ర సోషలిస్టు సోవియట్ యూనియన్‌ది. అనంతర కాలంలో పుతిన్ రష్యా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత%ొ% ఇరు దేశాలు తమ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించి ఈ ఏడాది అక్టోబర్‌కు 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం వాటి దృఢ నిశ్చయానికి ప్రతీక. తాజాగా ఢిల్లీ వేదికగా జరిగిన 23వ శిఖరాగ్ర సదస్సులో ఇరు దేశాల ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ముందుకు రావడం ముదావహం. 6,870 కోట్ల డాలర్లుగా ఉన్న ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 10వేల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలన్న ఆకాంక్ష సరైనదే.ప్రధాని నరేంద్రమోడీ అనుంగు మిత్రుడు ట్రంప్ అమెరికాలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత్ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయింది. ఉక్రెయిన్‌ను ఎగదోసి రష్యాతో యుద్ధానికి కారణమైన అమెరికా, దాని మిత్ర దేశాలు%ొ% ఆ తరువాత అనేక ఆంక్షలు విధించి, డాలర్‌తో మారకాన్ని స్తంభింపజేశాయి. ఈ తరుణంలో రష్యా రాయితీపై భారత్‌కు ముడిచమురును విక్రయిస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఈ వాణిజ్యమే కారణమంటూ కన్నెర్రజేసి, మనదేశంపై 25 శాతం అదనపు సుంకాలు వేయడంతోపాటు అనేక విధాలుగా ట్రంప్ ఆంక్షల చట్రంలో బంధిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిని చైనా ధైర్యంగా ఎదుర్కొని, ఎదురుదాడికి దిగడంతో తోకముడిచి కాళ్లబేరానికి వచ్చిన అమెరికా.. మనదేశం విషయంలో ఒత్తిళ్లను మరింతగా పెంచుతూనే ఉంది. వీటికి తలొగ్గి ఈ నెలాఖరుకు ముగిసే ఈ ఏడాది సీజన్ అంతా పత్తిపై 11 శాతం ఇంపోర్ట్ డ్యూటీని ఎత్తివేసింది. తమ పంటకు గిట్టుబాటు ధర రాక గుజరాత్‌లోనే ఏడుగురు పత్తిరైతులు ఉసురుతీసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కర్షకులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. సముద్ర ఎగుమతులు ఇప్పటికే నిలిచిపోయి.. ఎగుమతిదారులు లబోదిబోమంటున్నారు. తాజా శిఖరాగ్ర సదస్సులో నిరంతరాయంగా ఇంధన సరఫరా చేస్తామని పుతిన్ హామీ ఇచ్చినా%ొ% మన ప్రధాని నోరుమెదపలేదు. గత కొన్ని నెలలుగా రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు గణనీయంగా తగ్గుతున్నాయి. ట్రంప్ హూంకరింపులకు భయపడటంతో రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లు 75 శాతం నుంచి 36 శాతానికి పడిపోయాయి. అమెరికా నుంచి ఎన్నడూ లేని విధంగా 10 శాతానికి పెరిగాయి.పుతిన్ పర్యటనలో ఇరు దేశాల మధ్య 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, ఆహారభద్రత, నౌకాయానం, ఎరువులు, మెరైన్ ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఔషధాలు, విద్య, ఇండియా నుంచి రష్యాకు నిపుణులైన కార్మికుల వలస తదితర అంశాలతో ఒప్పందాలు చేసుకోవడం ఇరుదేశాల మధ్య వాణిజ్య లోటు తగ్గించేందుకు దోహదం చేసేదే. అణు విద్యుదుత్పత్తిపరంగా ఇండియాకు ఇప్పటికే తోడ్పాటు అందిస్తున్న రష్యా %-% రాబోయే రోజుల్లో మరిన్ని న్యూక్లియర్ రియాక్టర్లు, ఇతర అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణానికి హామీ ఇవ్వడం, జలాంతర్గాములుసహా ఇతర అంశాల్లో సహకారం ఇస్తానంది. అమెరికాతో పోలిస్తే రష్యాకు మనం చేసే ఎగుమతులు తక్కువ. ఇప్పుడు ఆ లోటు కొంతమేరకైనా భర్తీ చేసేలా ఒప్పందం కుదరడం శుభపరిణామం. ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నామని అమెరికాకు సంకేతాలిచ్చినట్లయింది. బ్రిక్స్ సదస్సులో ఇండియా, రష్యా, చైనా కలిసినప్పుడు డెడ్ ఎకానమీ అంటూ ట్రంప్ గంగవెర్రులెత్తారు. ఇండియా మిత్రదేశమని చెబుతూనే ఆపరేషన్ సింధూర్ లాంటి పరీక్షా సమయాల్లో ప్రత్యర్థులకు సహకరించే అమెరికా, పశ్చిమ దేశాలతో అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. ఊగిసలాట ధోరణులు మాని, ఇండియా, రష్యా, చైనాలాంటి దేశాలతో కలిసి స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించడమే భారత భవిష్యత్ ప్రయోజనాలకు, దేశ ప్రజల సౌభాగ్యానికి అత్యవసరం.

# ఈ తరాన్ని దారి తప్పిస్తున్న ‘వందేమాతరం’ వివాదం




సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో కోట్లమంది భారతీయుల గొంతుల్లో ధ్వనించిన వందేమాతర గీతం నేటి పాలకుల మతతత్వ రాజకీయలకు పాచికగా మారడం విషాదం. ‘చరిత్రను నిర్మించలేనివారు చరిత్రను వక్రీకరిస్తారు’ అన్నది కళ్ళముందు కనిపిస్తున్న సత్యం. గత పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి సాధించలేదు కాబట్టి ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. దీన్ని పక్కదారి పట్టించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు కొత్త అజెండాలు ముందుకు తెస్తున్నారు. తాజాగా దేశం ఎదుర్కొంటున్న రూపాయి విలువ దారుణ పతనం, విమానయాన ప్రయాణాల సంక్షోభం, పంటల గిట్టుబాటు ధరల గురించి చర్చించాల్సిన పార్లమెంట్‌లో 150 సంవత్సరాల నాటి వందేమాతరం గీతాన్ని పాలకులు చర్చనీయాంశం చేసారు. డిసెంబరు 6వ తేదీ (బాబ్రీమసీదు కూల్చివేత దినం)న దేశ ప్రధాని మోడీ మాట్లాడుతూ, ‘వందేమాతరం గీతంలోని కొన్ని చరణాలను తొలగించడమే దేశ విభజనకు బీజం వేసింది. విభజన మనస్తత్వం ఇప్పటికీ దేశానికి ఒక సమస్యగా ఉంది’ అన్నారు. ఈ తరం ఎదుర్కొంటున్న ఉపాధి, విద్య, వైద్యం, నివాసం లాంటి కనీస అవసరాలు తీర్చలేని పాలకులు రానున్న పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు, మతతత్వ అజెండాను కొనసాగించేందుకు వందేమాతరం అంశాన్ని మరోసారి తెరమీదికి తెచ్చారు.దేశం మొత్తం బ్రిటీష్ పాలన కింద వున్నప్పటికీ అనేక సంస్థానాల కింద దేశ ప్రజలు విభజించబడి వుండేవారు. ప్రజలను ఏకం చేయడం కోసం నాటి రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, రచయితలు, కవులు, కళాకారులు అనేక మార్గాల్లో కృషి చేశారు. అందులో భాగంగా దైవారాధనను ఒక మార్గంగా కొందరు ఎంచుకున్నారు. జాతీయోద్యమ తొలి రోజుల్లో ఇదంతా దేశభక్తిలో భాగంగానే జరిగింది. ఈ నేపథ్యంలోనే 1770 నాటి అతి భయంకరమైన బెంగాల్ కరువు, సన్యాసుల తిరుగుబాటు కథాంశంగా బెంగాల్ కవి బంకించంద్ర ఛటర్జీ ‘ఆనంద మఠం’ అనే నవలను 1875లో రాసారు. అందులో ఒక సాధువు పాత్ర మాతృభూమిని కాళీ దేవతతో పోల్చి పూజిస్తూ ‘బందేమాతరం’ గీతాన్ని ఆలపిస్తాడు. (తర్వాతి కాలంలో అది వందేమాతరంగా ప్రసిద్ధి పొందింది) ఈ నవల రాసిన ఏడు సంవత్సరాల తరువాత 1882లో ‘బంగదర్శన్’ అనే సాహిత్య పత్రికలో ప్రచురించబడింది. బ్రిటీష్ పాలకులు అనుసరించిన విభజించు, పాలించు కుట్రలో భాగంగా 1905లో బెంగాల్‌ను మతం ఆధారంగా విభజన చేశారు. దీనికి వ్యతిరేకంగా హిందూ, ముస్లింలు పెద్దఎత్తున ఉద్యమించారు. ఈ సందర్భంలో వందేమాతరం ప్రజానినాదంగా మారుమ్రోగింది. ప్రజా ఉద్యమంతో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ విభజనను రద్దు చేసుకున్నా- అది ఆశించిన మతతత్వ బీజాలను మాత్రం బలంగా నాటగలిగింది. ఈ పరంపరలో భాగంగా ముస్లింలీగు, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అనే మతసంస్థలు ఏర్పడ్డాయి. ప్రజలందరీ ఉమ్మడి నినాదాలు అయిన హిందూ, ముస్లిం భాయి భాయి స్థానంలో కొందరి నుండైనా అల్లాహూ అక్బర్, వందేమాతరం నినాదాలు ముందుకు రావడానికి ఈ మత సంస్థలే కారణమయ్యాయి.స్పష్టమైన జాతీయోద్యమ లక్ష్యాలతో 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. మత విశ్వాసాలు, ఆచారాల ఆధారంగా ప్రజలను సమీకరించడానికి భిన్నంగా వర్గ ఉద్యమాలు పెరిగాయి. బొంబాయి, కలకత్తా, మద్రాసు లాంటి ప్రాంతాల్లో కార్మిక పోరాటాలు, అనేక సంస్థానాల్లో భూమి, సామాజిక వివక్షపై ఉధృత పోరాటాలు జరిగాయి. ఈ పరిణామం బ్రిటిష్ పాలకులతో పాటు, దేశంలోని భూస్వామ్య, ధనాఢ్య వర్గాలను కలవరపాటుకు గురిచేసింది. ఈ వర్గాలు మత సంస్థలకు పెద్దఎత్తున విరాళాలు ఇచ్చి పెంచి పోషించాయి.‘వందేమాతర’ వివాదంవందేమాతర గీతం సుమారు 1900 సంవత్సరం వరకు ”అమ్మా, నీకు నమస్కరిస్తున్నాను” అనే శీర్షికతోనే పిలవబడేది. మతతత్వ రాజకీయ సమీకరణలు పెరిగేకొద్దీ ప్రతి అంశం హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలకు దారితీసింది. 1937లో లక్నోలో జరిగిన ముస్లిం లీగ్ 25వ సమావేశంలో ‘ఈ గీతం విగ్రహారాధనతో కూడినదని, ఇది ఇస్లామిక్ విశ్వాసాలకు భిన్నమైందని, భారతదేశంలో నిజమైన జాతీయవాదం పెరుగుదలను ఇది ఖచ్చితంగా దెబ్బతీస్తుంది’ అని తీర్మానించింది. ఆ తరువాత కొద్ది నెలలకు నెహ్రూ అధ్యక్షతన 1937 అక్టోబర్ 26న కలకత్తాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ‘జాతీయ సమావేశాల్లో వందేమాతరం ఎక్కడ పాడినా, మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలి’ అని తీర్మానించింది. మహమ్మద్ ఆలీ జిన్నాను బుజ్జగించేందుకు నెహ్రూ ఈ పని చేసారని విమర్శిస్తున్న ప్రధాని మోడీ ఈ చరణాలను ఎంపిక చేసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అనే విషయాన్ని మాత్రం కావాలనే మరుగు పరుస్తున్నారు. జాతీయ కాంగ్రెసు సమావేశంలో మొట్టమొదటిసారి 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతాన్ని ఆలపించినప్పుడు ఆ సమావేశానికి అధ్యక్షుడు రహమతుల్లా సయానీ అనే విషయాన్ని గుర్తించాలి. జాతీయోద్యమ నాయకుల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై తీవ్రమైన విబేధాలు, చర్చలు, రాజీలు జరిగాయి. వ్యక్తిగతంగా మహాత్మాగాంధీ- అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్- గాంధీ, గాంధీ- నెహ్రూ, నెహ్రూ- పటేల్‌ల మధ్యబీ రాజకీయంగా కాంగ్రెసు- కమ్యూనిస్టు పార్టీల మధ్య అనేక అంశాలపై విబేధాలు వచ్చాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి దేశాన్ని విముక్తి చేయాలనే ఉమ్మడి లక్ష్యం సాధనకు ఇవి ఆటంకం కాకుండా తాత్కాలికంగా అనేక మధ్యే మార్గాలను అనుసరించారు. జాతీయోద్యమ చరిత్రలో ఇలాంటి సంఘటనలు అనేకం వున్నాయి. అందులో వందేమాతర గీతం కూడా ఒకటి.మతతత్వ రాజకీయాల కోసం నేడు ఈ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్న శక్తులే జాతీయోద్యమంలో క్షమాభిక్షలు కోరిన విషయాలు ఆధారాలతో సహా బట్టబయలు అయ్యాయి. నాడు సామ్రాజ్యవాదం అనుసరించిన విభజించు పాలించులో భాగంగా సృష్టించిన మతతత్వాన్ని నేటికీ కొనసాగాలని ఈ శక్తులు కోరుకోవడమే జాతీయోద్యమ స్ఫూర్తికి విరుద్ధం. ఇలాంటి విషయాలపై ప్రజల దృష్టిని మళ్లించి దేశ సంపదను, సహజ వనరులను దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడంలో భాగంగానే- వందేమాతరం లాంటి సున్నిత అంశాలు పదేపదే వివాదాస్పదం అవుతున్నాయి. మతోన్మాదం ద్వారా లబ్ధి పొందాలనుకునే హిందూత్వ శక్తులు, ముస్లిం ఛాందసవాదులు ఇలాంటి అనేక అంశాలను వివిధ సందర్భాల్లో రెచ్చగొడుతూ, ప్రజల ఐక్యతను దెబ్బ తీసే ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. 2009లో ఉత్తరప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌లోని జమియత్ ఉలామా-ఇ-హింద్ ముస్లింలు జాతీయ గీతాన్ని పాడవద్దని కోరుతూ ఫత్వా జారీ చేసారు. ఈ ఫత్వాను నసీరుద్దీన్ షా, జావేద్ అక్తర్, షబానా అజ్మీ, సయీద్ అక్తర్ మీర్జా వంటి 100 మందికి పైగా ముస్లిం పండితులు, నటులు, రచయితలు వ్యతిరేకిస్తూ ప్రకటన చేశారు. 1992-93 మధ్య ముంబైలో జరిగిన మతఘర్షణల సందర్భంగా హిందూత్వవాదులు ‘ఈజ్ దేశ్ మే రహ్నా హై తో వందే మాతరం కహ్నా హొగా’ (మీరు ఈ దేశంలో నివసించాల నుకుంటే వందేమాతరం పాడాలి) అని నినాదాలు చేశారు.చరిత్రలో మాసిపోయిన గాయాలను రగిలించడం కాదు నేటి తరానికి కావలసింది. ఉన్నత విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, భద్రతతో కూడిన ఉపాధి, కుల, మత, లింగ వివక్షలు లేని మంచి భవిష్యత్తు కావాలి. అందుకు పాలకుల విధానాలు తోడ్పడాలి. ప్రజావ్యతిరేక పాలకులపై పొరుగు దేశాల్లో ప్రజాగ్రహం చూసి అయినా మన దేశ పాలకులు గుణపాఠం నేర్చుకోవాలి.

# ‘ఉపాధి’ ఉసురు తీస్తున్న ఎన్‌డిఏ

స్వాతంత్ర్యానంతరం గ్రామీణ పేదల కోసం వచ్చిన అతి కొద్ది చట్టాల్లో ఉపాధి హామీ చట్టం ఒకటి. ఈ చట్టం బాగా అమలు జరిగిన చోట పేదల వలసలు తగ్గాయి. కొనుగోలు శక్తి పెరిగింది. భూస్వామ్య వర్గాలతో పేదలకు బేరమాడే శక్తి వచ్చింది. వెరసి భారత ఆర్థిక వ్యవస్థ కుదేలు కాకుండా కొంత నిలబె ట్టగలిగింది. ఈ చట్టం యొక్క ప్రాధాన్యతను భారతదేశంలో అనేకమంది ఆర్థికవేత్తలు, మేధావులు కొనియాడారు. ప్రపంచ బ్యాంకు సైతం ప్రశంసించిందంటే ఈ చట్టం యొక్క ప్రాధాన్యత విదితమవుతుంది.గ్రామీణ పేదలకు పని లేని సమయంలో పని చూపించి పస్తుల నుంచి కాపాడడానికి ఉపాధి హామీ చట్టం దోహదపడింది. మన రాష్ట్రంలో లక్షలాది ఎకరాల సన్న, చిన్న కారు రైతుల భూములు అబివృద్ధి కావడానికి ఉపకరించింది. చదువుకున్న లక్షలాదిమంది యువతీ యువకులకు కొంత ఉపాధి చూపించగలిగింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన పాలకులే పీక నొక్కడానికి పూనుకున్నారు.2005లో చట్టం రూపుదిద్దుకున్నప్పుడు పేదలకు ఉపయోగ పడే అనేక అంశాలను చేర్చారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ జాబు కార్డు పొందవచ్చు. కార్డు పొందిన ప్రతి కుటుంబం ఏడాదికి వంద రోజులు పని చేయవచ్చు. చేసిన పనికి వారం వారం వేతనాలు చెల్లించాలి. పనిచేసే చోట మంచినీళ్లు, నీడ, 5 మంది పిల్లలు ఉంటే %-% ఒక ఆయాను ఏర్పాటు చేయాలి. ఆ నియామకంలో ఒంటరి మహిళలకు, వికలాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించింది. గ్రామీణ ఉపాధి నిధులను 90% వ్యవసాయ కార్మికులకు, 10 శాతం మాత్రమే మెటీరియల్ వర్క్‌కు కేటాయించాలి తప్ప ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలను ఉపయోగించరాదు. కాంట్రాక్ట్ విధానం నిషేధం ఈ చట్టాన్ని గడిచిన పదేళ్లుగా ఎన్డీఏ ప్రభుత్వం నీరుగారుస్తూ వచ్చింది. బడ్జెట్లో కేటాయింపులు తగ్గింపు మొదలు అనేక మార్పులు చేర్పులు చేసింది. 10 శాతం ఉన్న మెటీరియల్ కాంపోనెంటును 40 శాతానికి పెంచింది. యంత్రాలు ఉపయోగించరాదన్న రాజీ లేని సూత్రాన్ని ఎత్తేసి యంత్రాలను ప్రవేశపెట్టింది. సిమెంటు రోడ్లు, పక్కా భవనాలు పేరుతో కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు దోచుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ పనిలో రోజువారీ వేతనం కాకుండా క్యూబిక్ మీటర్ రేటు ప్రకారం (పీస్ రేటు) ఎంత పని చేస్తే అంత వేతనం వచ్చేది. ఎండాకాలంలో నేల గట్టిగా ఉండడం వల్ల 20 నుంచి 40% అదనంగా సమ్మర్ అలవెన్స్ కల్పించి కూలీలకు వేతనాలు గిట్టుబాటు అయ్యేవి. పీస్ రేటు వల్ల కూలీలు తెల్లవారకముందే ఉపాధి హామీ పనులకు వెళ్లి చేయగలిగినంత చేసి ఇంటికొచ్చిన తర్వాత తమ సొంత పొలంలోనూ లేదా తమ జీవనం కోసం ఇతర పనికి వెళ్లి పొట్ట పోసుకునేవాళ్లు. తద్వారా రెండు రకాల ఉపయోగం జరిగేది.గత మూడేళ్ళుగా మోడీ



ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో భారీగా నిధులు తగ్గించింది. రూ.194 వేతనాలు ఉన్నప్పుడు కేంద్ర బడ్జెట్లో రూ.80 వేల కోట్ల నుండి లక్ష పది వేల కోట్లు కేటాయించింది. ఆనాడు సుమారుగా ఐదున్నర కోట్ల కుటుంబాలు దేశవ్యాప్తంగా పనిచేశాయి. నేడు రోజు వేతనం మన రాష్ట్రంలో 217 రూపాయలు. ఈ లెక్కన కేంద్ర బడ్జెట్లో సుమారు రెండు లక్షల కోట్లు కేటాయించాలి. కానీ ఈ ఏడాది మరింత తగ్గించి రూ.81 వేల కోట్లకు కుదించారు. ఈ కారణంగా మన రాష్ట్రంలోనే 17 లక్షల కుటుంబాలు సుమారు 3 కోట్ల పనిదినాలను కోల్పోయాయి. గతంలో 100 రోజులు చేసిన కుటుంబాలు 15 శాతం ఉంటే నేడు 4 శాతానికి మించి లేవు. అవినీతి జరుగుతుందనే నెపంతో మన రాష్ట్రంలో 82 లక్షల జాబుకార్డులు ఉంటే గ్రామంలో నివాసం లేరని నెపంతో వలసబోయిన కూలీల కార్డులను, ఏడాదికి పది రోజులు మించి పనిచేయని కూలీల కార్డులను, ఇంకా రాజకీయ కారణాలతోనూ తొలగించింది. సుమారు 40 లక్షల మంది కార్మికులకు పని ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్డులను రద్దు చేశాయి. దీనివల్ల ఆయా పేద కుటుంబాలు రూ.630 కోట్లను నష్టపోయాయి.



## శాంతారామ్ రెండో భార్యగా..

భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు, నిర్మాత వీ శాంతారామ్ జీవితం ఆధారంగా దర్శకుడు అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే బయోపిక్‌ను రూపొందిస్తున్నారు. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు 'వి. శాంతారామ్'గా ఖరారు చేశారు మేకర్స్. రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే, సరిత అశ్విన్ వర్ధే నిర్మాతలు. ఈ ప్రాజెక్ట్‌లో టైటిల్ పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ స్టార్ సిద్ధాంత్ చతుర్వేది ఫస్ట్‌లుక్‌ని ఇప్పటికే విడుదల చిత్ర బృందం తాజాగా కథానాయికను పరిచయం చేసింది.

## అంతకుమించింది తెచ్చిస్తడే..

రవితేజ హీరోగా దర్శకుడు కిషోర్ తిరుమల తెరకెక్కిస్తున్న చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'అద్దం ముందు' ప్రోమో రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పూర్తి పాటను బుధవారం విడుదల చేశారు. 'చల్లగాలి కావాలంటే చందమామను తీసుకొస్తాడే..సన్నజాజి కావాలంటే సంత మొత్తం మోసుకొస్తాడే.. అడిగింది అందిస్తడే.. అంతకు మించింది తెచ్చిస్తడే.. కోరింది తీరుస్తడే.. వేరే కోరిక నాకింక లేకుండ చేస్తాడే.. అద్దం ముందు నిలబడి అబద్ధం చెప్పలేనే.. నా అద్దం అంటె నువ్వే మరి ఈ నిజం దాచలేనే..' అంటూ సాగుతోందీ గీతం. రవితేజ, డింపుల్ హయతిపై చిత్రీకరించిన ఈ మెలోడీ డ్యూయెట్‌ను భీమ్స్ స్వరపర్చగా, చంద్రబోస్ సాహిత్యం అందించారు.



## రచయితకు స్వేచ్ఛనిస్తేనే కొత్త తరహా సినిమాలు



స్టార్ హీరో కార్తి నటిస్తున్న చిత్రం 'అన్నగారు వస్తారు'. ఈ చిత్రాన్ని యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ సినిమాలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నెల 12న విడుదల కానున్న ఈ సినిమా విశేషాలను కథానాయకుడు కార్తి విలేకరులతో పంచుకున్నారు. డైరెక్టర్ నలన్ కుమారస్వామి 'సూదు కవ్వమ్' సినిమాకు ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన 8 ఏళ్ల తర్వాత చేస్తున్న చిత్రమిది. సినిమాలు చేయకుంటే వాళ్లను మర్చిపోతాం. కానీ నలన్ సినిమా కోసం ఎదురుచేస్తున్నారు.సూపర్ హీరో అంటే బ్యాట్స్‌మ్యాన్, సూపర్ మ్యాన్ అనే అనుకుంటాం. కానీ మన సంస్కృతిలోనూ ఎన్టీఆర్, ఎంజీఆర్ లాంటి సూపర్ హీరోలు ఉన్నారు. వాళ్లు మన సినిమాను, పాలిటిక్స్‌ను మార్చేశారు. అలాంటి సూపర్ హీరో తిరిగి వస్తే ఎలా ఉంటుందనేదే ఈ సినిమా ఇది. 80వ దశకంలో మాస్ కమర్షియల్ సినిమా మేనియాను గుర్తుచేస్తూ, కాల్పనిక ప్రపంచంలో జరిగే కథ ఇది. ఈ సినిమా సవాలుతో కూడుకున్న ప్రయత్నం. రచయితకు స్వేచ్ఛ ఇచ్చినప్పుడే కొత్త తరహా సినిమాలు వస్తాయి. అవేంజర్స్ లాంటి విజువల్స్, మ్యూజిక్‌తో ఈ సినిమాను నలన్ కొత్తగా ప్రెజెంట్ చేశాడు. అందుకే, ఈ సినిమాను ఎంతో ఉత్సాహంగా చేశాను. హీరో, సాంగ్స్, విలన్, ఫైట్స్.. ఇలా ఒక స్ట్రక్చర్ ఉన్న సినిమాలు మన దగ్గరే ఉన్నాయి.. ప్రపంచంలో మరెక్కడా చూడం. ఆ పర్ఫెక్ట్ మాస్ కమర్షి యల్ మూవీస్ 80, 90 దశకాల్లోనే వచ్చాయి. సీరియస్‌గా కథ జరుగుతున్నప్పుడు మన సినిమాల్లో ఒక పాట పెడతాం, ప్రేక్షకులను రిలాక్స్ చేసి మళ్లీ కథలోకి తీసుకెళ్తాం. అది మన సినిమాకే సాధ్యం. అలాంటి స్ట్రక్చర్ కథతో కొత్త మోడరన్ ప్రెజెంటేషన్‌తో ఈ సినిమా ఉంటుంది. నటుడిగా నాకు ప్రత్యేకత తీసుకొచ్చేది నా స్క్రిప్ట్ సెలెక్షనే. ఎన్టీఆర్, ఎంజీఆర్ ఇద్దరి కెరీర్స్‌లో అక్కడి సినిమాలు ఇక్కడ.. ఇక్కడి సినిమాలు అక్కడ రీమేక్స్ జరిగాయి. ఈ క్రాస్ ఓవర్ వల్ల ఆ మహా నటుల కెరీర్‌లో ఎన్నో పోలికలు కనిపిస్తాయి. అవి మా సినిమాలోనూ చూస్తారు. డైరెక్టర్ నలన్ గత సినిమాలు సాడ్ ఎండింగ్‌తో ఉంటాయి. చాలా క్యారెక్టర్స్ కనిపిస్తాయి. ఈ సినిమా మాత్రం హీరో సెంట్రిక్‌గా ఉంటుంది.

## మోగ్లీ ఒక రోజు వెనక్కి

యంగ్ హీరో రోషన్ కనకాల చిత్రం 'మోగ్లీ 2025'పై బాలకృష్ణ ప్రభావం పడింది. బాలకృష్ణ నటించిన 'అఖండ2' గత వారం రిలీజ్ కావాల్సి ఉండగా, వాణిజ్య సమస్యల కారణంగా విడుదలను రద్దు చేశారు. సందిగ్ధ పరిస్థితుల నడుమ ఈ శుక్రవారం రిలీజ్‌కు వస్తోంది. దీంతో మోగ్లీ టీమ్‌కు ఒక రోజు వెనక్కి వెళ్లడం అనివార్యమైంది. ముందుగా ప్రకటించిన ప్రకారం డిసెంబర్ 12న కాకుండా డిసెంబర్ 13కు రానున్నట్టు వెల్లడించారు. ప్రీమియర్స్ మాత్రం 12నే ప్రారంభం కానున్నాయి. సందీప్‌రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి కాలబైరవ సంగీతం అందించగా, రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, కోదాటి పవన్‌కళ్యాణ్ ఎడిటింగ్, కిరణ్ మామిడి ప్రొడక్షన్ డిజైన్ చేశారు.





## వెంకటేశ్ ఆదర్శ కుటుంబం ఆరంభం

కుటుంబ కథాచిత్రాల కథానాయకుడి గా విక్టరీ వెంకటేశ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉం ది. చక్కిలిగింతలు పెట్టే హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసే చిత్రాలను తెరకెక్కించడంలో త్రివిక్రమ్ దిట్ట. ఇప్పుడు వీరి కలయికలో ఓ సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. వెంకటేశ్ సినీప్రయాణంలో 77వ చిత్రంగా రూపొందుతు న్న ఈ సినిమా చిత్రీకరణ బుధవారం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో మొదలైంది.

## జాతిరత్నాలు డైరెక్టర్‌తో..



ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా నటిగా రష్మికలోని మరో కోణాన్ని ఆవిష్కరించింది. ఆమెను ప్రధానంగా చేసుకొని బలమైన కథలతో సినిమాలు చేయొచ్చనే నమ్మకాన్ని మేకర్స్‌కు కలిగించిన సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. అందుకే ఇప్పుడు పలువురు దర్శకులు రష్మిక కోసం కథలు అల్లే పనిలో పడ్డారు. వారిలో ముందువరుసలో ఉన్నారు 'జాతిరత్నాలు' ఫేం కేవీ అనుదీప్. ఇప్పటికే రష్మిక కోసం ఆయన ఓ కథను సిద్ధం చేశారట. అయితే.. ఈ కథ అనుదీప్ గత చిత్రాల తరహాలో కామెడీ కాన్సెప్ట్ కాదట. ఈసారి తన ధోరణికి పూర్తి భిన్నంగా భావోద్వేగాలతో కూడిన సీరియస్ కథనే అనుదీప్ సిద్ధం చేశారట. ఇక ఆ కథను నేషనల్ క్రష్‌కు వినిపించడమే తరువాయి. ఈ సినిమా తీసేందుకు స్వప్న సినిమా సంస్థ కూడా సిద్ధంగా ఉన్నదని తెలిసింది. మరి ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

## ఇండియా మిస్స్ ఎంట్రీ టాలీవుడ్ నుంచే!



అందాల పోటీలో టైటిల్ గెలుచుకున్న మరో కొత్తం దం చిత్రపరిశ్రమకు పరిచయమవుతోంది. ఆమే మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో కిరీటం దక్కించుకున్న రియా సింఘా. ఈ భామ తెలుగు సినిమాతోనే నట ప్రయాణం ప్రారంభిస్తుండటం విశేషం. కమెడియన్ సత్య హీరోగా రూపొందుతున్న చిత్రం 'జెట్లీ'. దర్శకుడు రితేశ్ రాణా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంతో రియా సింఘా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.రియా సింఘాకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ మేకర్స్ బుధవారం ఆమె ఫస్ట్‌లుక్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో ఉంది రియా. మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్, చిరంజీవి చెర్రీ, హేమలత పెదమల్లు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాల భైరవబీ డీవోపీ: సురేశ్ సారంగంబీ యాక్షన్: వింగ్ చున్ అంజిబీ ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్.